దేశంలోనే ఉత్తమ పంచాయతీగా జగన్నాథపురం

- 17న ఢిల్లీలో ప్రదానం చేయనున్న ఉపరాష్ట్రపతి
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హర్షం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతీయ మంచినీటి వనరుల విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని జగన్నాథపురం దేశంలోనే ఉత్తమ గ్రామపంచాయతీ అవార్డును పొందిందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 17న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోనున్నట్లు పేర్కొన్నారు. అవార్డు పొందిన జగన్నాథపురం గ్రామ పంచాయతీకి, పాలకవర్గం, సిబ్బంది, అధికారులకు అభినందనలు తెలిపారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ 11 కేటగిరీలలో 41 మంది విజేతలను ప్రకటించిందనీ, అందులో ఉత్తమ రాష్ట్రంగా మధ్యప్రదేశ్, ఉత్తమ జిల్లాగా ఒడిశాలోని గంజాం, ఉత్తమ గ్రామ పంచాయతీగా జగన్నాథపురం నిలిచాయని వివరించారు. ఈ నెల 17 ఢిల్లీలో గల విజ్ఞాన్ భవన్‌లోని ప్లీనరీ హాల్‌లో నిర్వహించే కార్యక్రమంలో అవార్డులు అందచేస్తారు. అవార్డు విజేతలకు ప్రశంసా పత్రం మరియు ట్రోఫీతో పాటు నగదు బహుమతులు అందిస్తారని చెప్పారు. సీఎం కేసీఆర్ దార్శనికత వల్ల రూపొందించి, అమలు చేస్తున్న పల్లె ప్రగతి, ప్రగతి ఫలాలు ఈ రూపంలో కనిపిస్తున్నాయని పేర్కొన్నారు.

దేశానికి నిర్దిష్ట లక్ష్యం లేదు

- ఎన్నికల రాజకీయతంత్రంలో దేశం చిక్కుకుంది
- నాగ్‌పూర్‌లో బిఆర్ఎస్ కార్యాలయ ప్రారంభోత్సవ సభలో కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారతదేశానికి నిర్దిష్టమైన లక్ష్యం లేదని తెలంగాణ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ అన్నారు. దేశం అన్ని రంగాల్లో వెనకబడే ఉందనీ, అది తలుచుకుంటే భయమేస్తుందని చెప్పారు.

దేశంలో ఎలాగైనా ఎన్నికల్లో గెలవడమే కొందరికి లక్ష్యంగా మారిందనీ, ఎన్నికల రాజకీయతంత్రంలో దేశం చిక్కుకుపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల్లో గెలవాల్సింది నేతలు కాదు.. జనం గెలవాలని అన్నారు. ఎన్నికల్లో జనం గెలిస్తే సమాజమే మారుతుందని పేర్కొన్నారు.

గురువారం మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో బిఆర్ఎస్ కార్యాలయాన్ని కెసిఆర్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. దేశ ప్రజలు చంద్రుడు, నక్షత్రాలు కోరట్లేదు. నీళ్ల ఇవ్వమని కోరుతున్నారు..అది కూడా ఇచ్చే పరిస్థితి దేశంలో లేదన్నారు. ఔరంగాబాద్‌లో 8 రోజులకు ఒకసారి తాగునీరు వస్తోందని చెప్పారు. గంగా, యమునా డెల్టా ప్రాంతమైన ఢిల్లీలోనూ ఇదే దుస్థితి ఉందని గుర్తుచేశారు. మహారాష్ట్ర దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రం. వివిధ పార్టీల నుంచి ఎందరో సిఎంలు వచ్చారు. కానీ, ఇక్కడి పరిస్థితులను మాత్రం ఏ ముఖ్యమంత్రి మార్చలేదన్నారు. దేశ రాజధానిలోనూ అదే దుస్థితి ఉందన్నారు. ఢిల్లీలో తాగునీరే కాదు.. విద్యుత్ కొరత సమస్య కూడా ఉందని చెప్పారు. ఇటీవల కర్ణాటక ఎన్నికల్లో బిజెపి ఓడింది.. కాంగ్రెస్ గెలిచిందనీ, పరిస్థితుల్లో మార్పు రానప్పుడు ఎవరు గెలిచి ఏం ప్రయోజనం? అని పేర్కొన్నారు. ఇప్పటికైనా జనం గెలిచే రాజకీయాలు చేయాలన్నారు. బరాక్ ఒబామా అధ్యక్షుడు అయ్యాకే అమెరికాలో పాప ప్రక్షాళన జరిగిందని వివరించారు.

దేశంలో దళితుల, ఆదివాసీల ఉద్ధరణ జరిగి తీరాల్సిందేనని స్పష్టంచేశారు. ఎస్‌సిల పరిస్థితులు మారనంత కాలం దేశం అభివృద్ధి చెందదన్నారు. దేశం మారాల్సిన సమయం వచ్చేసింది. ఇప్పటికే వేల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందని లెక్కలు వివరించారు. ప్రపంచంలో భారత్‌లోనే ఎక్కువశాతం సాగుయోగ్యమైన భూమి ఉందనీ, మనం తలుచుకుంటే దేశంలోని ప్రతి ఎకరానికి సాగునీరు ఇవ్వొచ్చని తెలిపారు. భగవంతుడు ఎన్నో వనరులు సమృద్ధిగా ఇచ్చినా ప్రజలకు ఎందుకీ కష్టాలని ప్రశ్నించారు. ప్రభుత్వాల వద్ద చిత్తశుద్ధి లేకపోవడమే అన్నిటికీ కారణమని పేర్కొన్నారు. ఉచిత విద్యుత్, ఉచిత నీరుతో తెలంగాణలో సాగును పండుగలా మార్చామనీ, ఇప్పుడు తెలంగాణ వరి ఉత్పత్తిలో పంజాబ్‌ను దాటేసిందని తెలిపారు. రాష్ట్రంలో పండిన పంటంతా ప్రభుత్వమే కొంటోంది. పంట సొమ్ము నేరుగా రైతుల ఖాతాల్లో వేస్తున్నామని చెప్పారు. తెలంగాణలో ప్రతి ఇంటికీ నల్లా ద్వారా తాగునీరు అందిస్తున్నామని వివరించారు. తాగునీరు కోసం బిందెలు పట్టుకుని తిరిగే పరిస్థితి రాష్ట్రంలో ఎక్కడాలేదన్నారు. తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థను డిజిటలైజ్ చేసి అవినీతికి అడ్డుకట్ట వేశామన్నారు. గతంలో తెలంగాణలో మహారాష్ట్ర కంటే ఎక్కువగా రైతు ఆత్మహత్యలు జరిగేవి. ఇప్పుడు తెలంగాణలో సాగుకు 24 గంటల ఉచిత విద్యుత్ లభిస్తోంది. రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గిపోయాయని చెప్పారు. "తెలంగాణలా చేస్తే మహారాష్ట్ర దివాలా తీస్తుందని కొందరు మరాఠా నేతలు అంటున్నారు. తెలంగాణ తరహాలో చేస్తే మరాఠా నేతలు దివాలా తీస్తారు.. ప్రజలు దీపావళి జరుపుకొంటారు. మహారాష్ట్రకే వెళ్తున్నారు.. మా మధ్యప్రదేశ్‌కు రావట్లేదని అక్కడి ప్రజలు అంటున్నారు. మహారాష్ట్రలో తెలంగాణ నమూనా పాలన వచ్చే వరకు బిఆర్ఎస్ పోరాడుతోంది. మహారాష్ట్రలో అనేక మంది నేతలు బిఆర్ఎస్ వైపు చూస్తున్నారు. త్వరలోనే లక్షల సంఖ్యలో బిఆర్ఎస్ సభ్యత్వాలు నమోదవుతాయి" అని కెసిఆర్ పేర్కొన్నారు. మహారాష్ట్రలో త్వరలోనే పరివర్తన వస్తుందనీ, అది దేశమంతా పాకుతుందని విశ్వాసం వ్యక్తంచేశారు. త్వరలో పుణె, ఔరంగబాద్‌లో బిఆర్ఎస్ కార్యాలయాలు ప్రారంభిస్తామని కెసిఆర్ ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపి కేశవరావు, ఎమ్మెల్సీలు బాల్క సుమన్, జీవన్ రెడ్డి, ఎపి బిఆర్ఎస్ అధ్యక్షులు తోట చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు యుడిఐడి కార్డులు పంపిణీ చేయాలి

- ఎన్‌పిఆర్‌డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వికలాంగులకు యుడిఐడి కార్డులు పంపిణీ చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్యతో పాటు కోశాధికారి ఆర్ వెంకటేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. వికలాంగుల కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 రకాల సంక్షేమ పథకాలకు యూనిక్ డిజేబులిటీ ఐడి (యుడిఐడి) కార్డు తప్పనిసరి చేయాలనే ఆలోచనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆయా పథకాలకు దరఖాస్తు చేయాలంటే 2023-24 ఆర్థిక సంవత్సరం నుంచి యుడిఐడి, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన వైకల్యం ధ్రువీకరణ పత్రంతో పాటు కేంద్రం జారీ చేసిన ప్రత్యేక వికలాంగ గుర్తింపు సంఖ్య, ఎన్‌రోల్‌మెంట్ నంబర్‌ను తప్పనిసరి చేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతోందని తెలిపారు. ఈ చర్యను వెంటనే వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు. సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ, వికలాంగుల సాధికారత విభాగం, దాని అనుబంధ సంస్థలు విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్‌ల వంటి పథకాల ప్రయోజనాలను పొందేందుకు యుడిఐడి కార్డు తప్పనిసరి చేయాలని నిర్ణయించడం సమంజసం కాదని పేర్కొన్నారు. నేషనల్ ట్రస్ట్, రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, అన్ని నేషనల్ ఇన్‌స్టిట్యూట్‌ల ద్వారా అందుతున్న సేవలకు యుడిఐడి అనివార్యమని ప్రకటించడం అంటే వికలాంగులకు ఆయా పథకాలను దూరం చేయడమేనని విమర్శించారు. వైకల్యం స్వభావం,దాని తీవ్రత శాతం ఆధారంగా దేశవ్యాప్తంగా చెల్లుబాటు అయ్యే విధంగా కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణకు జన్మనిచ్చిన సిద్దిపేట

- ప్రతి నియోజకవర్గం అభివృద్ధి చెందినప్పుడే బంగారు తెలంగాణ
- ఐటి టవర్ ప్రారంభోత్సవంలో మంత్రి కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రానికి సిద్దిపేట జన్మనిచ్చి ఒక నాయకున్ని ఇచ్చిందని ఐటీ శాఖ మంత్రి కెటిఆర్ అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ గ్రామ శివారులో బొగ్గులోని బండలో నిర్మించిన ఐటీ టవర్‌ను మంత్రి హరీశ్ రావుతో కలిసి కెటిఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. సిద్దిపేటను చూసి అసూయపడేలా మంత్రి హరీశ్‌రావు అభివృద్ధి చేస్తున్నారని, ప్రతి నియోజకవర్గం సిద్దిపేటలా అభివృద్ధి చెందినప్పుడే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని తెలిపారు. తెలంగాణ మోడల్ అంటే సమగ్ర, సమీకృత, సమతుల్య, సమ్మిళిత అభివృద్ధి అని, ఓ వైపు పంచాయతీ అవార్డులు.. మరోవైపు పట్టణ ప్రగతి అవార్డులు జాతీయ స్థాయిలో మనకు వస్తున్నాయని తెలిపారు. సిద్దిపేట స్ఫూర్తితో ప్రతి జిల్లాలో స్వచ్ఛబడి ఏర్పాటు చేస్తామని తెలిపారు. 1980లో సిద్దిపేట అభివృద్ధి మొదలైందని, మిషన్ భగీరథకు పునాది పడ్డది కూడా సిద్దిపేటలోనే అని తెలిపారు. మిషన్ భగీరథ పథకాన్ని కేంద్రం హర్ ఘర్ జల్ అని కాపీ కొట్టిందన్నారు. రాబోయే ఎన్నికల్లో హరీశ్ రావుని లక్షా 50 వేల మెజార్టీతో గెలిపించాలన్నారు. ఐటీ హబ్‌ను ఇంకా విస్తరిస్తామని, టాస్క్‌తో యువతకి శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇప్పిస్తామని తెలిపారు. 2014లో తెలంగాణ ఏర్పడినప్పుడు ఐటీ ఎగుమతులు రూ.56 వేల కోట్లు ఉంటే ఈ తొమ్మిదేళ్లలో రూ.2.41 లక్షల కోట్లు ఉందన్నారు. ప్రపంచంలో ఏ ప్రభుత్వమైనా అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చే అవకాశం ఉండదని, కానీ తెలంగాణలో 6.5 లక్షల ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారని తెలిపారు. యువతకు ప్రయివేట్ ఉద్యోగం సృష్టించడం కోసం ఎన్నో పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. కలలోనైనా సిద్దిపేటకి ఐటీ టవర్ వస్తుందని అనుకోలేదని, ఇదంతా సిఎం కెసిఆర్ చలవేనని తెలిపారు. సిద్దిపేటలో చదివిన బిడ్డలు సిద్దిపేటలోనే ఐటీ ఉద్యోగం చేస్తున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో మంత్రి కెటిఆర్ సహకారంతో మరికొన్ని పరిశ్రమలు తెస్తామన్నారు. దేశ విదేశాల్లో పర్యటించి రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, శాంతిభద్రతల గురించి తెలియజేసి ఎన్నో అంతర్జాతీయ ఐటీ కంపెనీలు, మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీలు తీసుకొచ్చారని తెలిపారు. కెటిఆర్ లాంటి ఐటీ మినిస్టర్ ఇతర రాష్ట్రాల్లో కావాలని యువత కోరుకుంటోందన్నారు. ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్‌లో పరిశ్రమలకు పవర్ హాలీడే ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సతీష్ కుమార్, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఎమ్మెల్సీలు యాదవ రెడ్డి, ఫరూక్ హుస్సేన్, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, టిఎస్ఐసి చైర్మెన్ గ్యాదరి బాలమల్లు, ఐటీ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్ రంజన్, జడ్‌పి చైర్మెన్ రోజా రాధాకృష్ణ శర్మ, టిఎస్ఐఐసి ఎండి నరసింహారెడ్డి, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రులు

ఓటమి భయంతోనే దర్యాప్తు సంస్థలతో దాడులు

- తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో ఓటమి భయంతోనే బిజెపి దర్యాప్తు సంస్థలను ఊసిగొల్పుతున్నతని తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడే రాజీవ్ సాగర్ గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఖమ్మం సభలో ప్రజలు నిలదీస్తారని తెలిసే అమిత్ షా సభను రద్దు చేసుకున్నారని పేర్కొన్నారు. బిజెపిలోకి వెళ్లని నేతలపై దర్యాప్తు సంస్థలు దాడులు జరిపి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని తెలిపారు. బిఆర్ఎస్ నేతలు బిజెపి చిల్లర రాజకీయాలకు భయపడరని స్పష్టం చేశారు. బిజెపి ఎన్ని కుయుక్తులు పన్నినా తెలంగాణలో వారి ఆటలు సాగవని హెచ్చరించారు. బిజెపియేతర రాష్ట్ర సర్కార్‌లను ఇబ్బంది పెట్టేందుకే దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని తెలిపారు.

నేడు దోస్త్ సీట్ల కేటాయింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిఎ, బిఎస్‌సి, బికాం, బికాం ఒకేషనల్, బికాం ఆనర్స్, బిబిఎ, బిసిఎ, బిబిఎం, బిఎస్‌డబ్ల్యు, బిసిఎ కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) తొలివిడత సీట్ల కేటాయింపు శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఉంటుంది. ఈ కార్యక్రమానికి ఉన్నత విద్యామండలి చైర్మెన్, దోస్త్ కన్వీనర్ ఆర్ లింబాద్రి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ వి వెంకటరమణ హాజరవుతారు. దోస్త్ తొలివిడతలో 1,05,933 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, 96,361 మంది ఫీజు చెల్లించారని, 88,181 మంది దరఖాస్తు ఫారం నింపారు. వారిలో 78,495 మంది వెబ్‌ఆప్షన్లు నమోదు చేశారు.

In The Court Of The Principal District Judge
Eluru :: W.G.Dt., A.P.
M.V.O.P.No. 586/2022

Between:
Boilla Jyothi and Others ***...Petitioners***
AND
R.Shankar and Others***...Respondents***

1st Respondent:
R.Shankar, S/o. Marauah, Driver of Lorry No. TS 07 UG 7369, D/o. 4-52, Prada, Kattangoor, Nalgonda - 508205.

పై నెంబరునందు 1వ రెస్పాండెంటు గారు అయిన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పుచ్చుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున **ది.27-06-2023న ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు గాని, మీ ప్లీడరు గారు గాని పై కోర్టు వారి ఎదుట హాజరు కాగలరు.** లేని ఎడల పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేది : 27-06-2023

ELURU VENKATESWARA RAO
ELURU SESHA MAHESH BABU
Advocates, Eluru. Cell: 94401 88677

వ్యవసాయ రంగంలో తెలంగాణ మేటి

- ఎఎఫ్ఒ డైరెక్టర్ జనరల్ క్యూయూడోన్యూ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రంగవల్లులను పరిశీలిస్తున్న క్యూయూడోన్యూ

వ్యవసాయ రంగంలో తెలంగాణ మేటిగా నిలుస్తోందని ఆహార వ్యవసాయ సంస్థ (ఎఎఫ్ఒ) డైరెక్టర్ జనరల్ క్యూయూడోన్యూ అన్నారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల కేంద్రంలో ఎఎఫ్ఒ 20 దేశాలకు చెందిన ప్రతినిధులు, జీ-20 డైరెక్టర్ జనరల్ క్యూయూడోన్యూ.. వ్యవసాయ రంగంపై రైతులతో ముచ్చటించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బంధు, రైతుబీమా, కొండపోచమ్మ భారీ నీటిపారుదల ప్రాజెక్టు వల్ల వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు, ఆర్థిక స్థితిగతులపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా క్యూయూడోన్యూ మాట్లాడుతూ.. తానూ ఒక రైతు బిడ్డనని, తల్లిదండ్రులు చదివించడంతో ఈ స్థాయిలో ఉన్నానని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల రైతుల ఆదాయంలో మార్పు వచ్చిందన్నారు. ఈ ఆదాయాలతో పిల్లల విద్యను, జీవన ప్రమాణాలను పెంచుకోవాలని సూచించారు. రైతులు సమగ్ర వ్యవసాయ విధానాన్ని పాటించాలన్నారు. రైతుకు కావాల్సిన అన్ని ఆహార పదార్థాలను రైతే పండించుకోవాలని సూచించారు. మహిళ సాధికారత కోసం ప్రభుత్వాలు పనిజేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టుల వల్ల రైతులకు ఎంతో మేలు జరిగిందని, మరిన్ని ప్రాజెక్టులు నిర్మించాలని చెప్పారు. నీటి లభ్యత వల్ల ఉత్పాదక పంటలు పెరుగుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టులు ఎంతో అద్భుతంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. భారతదేశ అభివృద్ధిలో ముందుకెళ్తోందని, మరింత ముందుకెళ్లాలని ఆకాంక్షించారు. అనంతరం అగ్రికల్చర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం రఘునందన్‌రావు మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లలో వ్యవసాయ రంగంలో మంచి మార్పు సంభవించిందని తెలియజేశారు. రాష్ట్రంలో వ్యవసాయం రంగం సాధించిన అభివృద్ధిని చూడడానికి వివిధ దేశాల నుంచి ప్రజాప్రతినిధులు వచ్చి చూసిపోతున్నారని ప్రశంసిం చారు. తెలంగాణలో మరిన్ని ప్రాజెక్టులు నిర్మించాలని చెప్పారు. కార్యక్రమంలో స్పెషల్ కమీషనర్ హనుమంతు జి, అడిషనల్ కలెక్టర్ ముజామిల్ ఖాన్, ఎఫ్‌డిసి చైర్మెన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, వ్యవసాయాధికారి డా.టి నాగేందర్ రెడ్డి, ఇజిఎస్ ఇసి రాజు, తోర్నాల వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త శ్రీదేవి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఉద్యాన శాఖ జిల్లా అధికారి సునీత, ఎచ్ఒ సౌమ్య, ఎఇఒలు రజనీకాంత్, విష్ణు, అశ్విని, జిల్లా వ్యవసాయ శాఖ సిబ్బంది ఉద్యాన శాఖ సిబ్బంది, ఆయిల్ ఫెడ్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలై రామన్

యువత నిరంతర పోరాటాలు సాగించాలి

- ఎఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ తిరుమలై రామన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిరుద్యోగులను మోసం చేసే పాలకులపై యువత నిరంతరం పోరాటాలు కొనసాగించాలని ఎఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ తిరుమలై రామన్ పిలుపునిచ్చారు. ఉపాధి అవకాశాలు కల్పించకుండా కాలయాపన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై ఉద్యమించాలన్నారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఎన్ సత్యనారాయణరెడ్డి భవన్‌లో గురువారం ఎఐవైఎఫ్ రాష్ట్ర విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ తిరుమలై రామన్ మాట్లాడుతూ.. సిఎం కెసిఆర్ ప్రభుత్వానికి నిరుద్యోగుల భవిష్యత్‌పై చిత్తశుద్ధిలేదని, దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో దారుణ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. రిక్రూట్‌మెంట్ బోర్డ్ పోటీ పరీక్షలను నిష్పక్షపాతంగా నిర్వహించలేక పోయిందని ఆరోపించారు. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తూ కాలయాపన చేస్తున్నారన్నారు. ప్రజల జీవన పరిస్థితులను మెరుగుపర్చలేని ప్రభుత్వ పథకాలు అవసరం లేదని, రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ సంస్థలను నిర్మించాలని తద్వారా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. సిఎం కెసిఆర్ నిరంకుశ విధానాలపై యువత సంఘటిత ఉద్యమాల్లో పాల్గొనాలని, ఉపాధి కల్పించే వారికే రానున్న ఎన్నికల్లో ఓటు అనే నినాదంతో యువతను చైతన్యపర్చనున్నామని తెలిపారు. సమావేశంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలీ ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె ధర్మేంద్ర, ఆఫీస్ బేరర్స్ నెర్లకంటి శ్రీకాంత్, కనుకుంట్ల శంకర్, లింగం రవి, వెంకటేశ్వర్లు, యుగంధర్, కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, సత్యప్రసాద్, ఆర్.బాలకృష్ణ, బిజ్జ శ్రీనివాస్, లక్ష్మణ్, కిషోర్, సల్మాన్, మహేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నం పెట్టండి

- భోజనం కోసం విద్యార్థుల భిక్షాటన
- ఖాళీ ప్లేట్లతో టియు మెయిన్ గేట్ ఎదుట నిరసన
- నిరవధిక సమ్మెలో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'అన్నం పెట్టండి' అంటూ తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థులు ఖాళీ ప్లేట్లతో ఇంటింటికీ వెళ్లి భిక్షాటన చేశారు. టియులోని మెస్‌వర్కర్లకు వేతనాలు చెల్లించకపోవడంతో మూడు రోజులుగా అవుట్‌సోర్సింగ్ సిబ్బంది విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్నారు. దాంతో టియు విద్యార్థులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం పెట్టకపోవడంతో జాతీయ రాహదారి పక్కనున్న నడ్పల్లి తండాలో ఇంటింటికీ వెళ్లి.. 'అమ్మా.. అన్నం పెట్టండి' అంటూ విద్యార్థులు భిక్షాటన చేశారు. అంతకుముందు విద్యార్థులు టియు మెయిన్ గేటు ఎదుట ఖాళీ ప్లేట్లతో బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. విసి నిర్లక్ష్యం వల్ల ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతాలు రాక నిరవధిక సమ్మె చేస్తున్నారని, దాంతో యూనివర్సిటీలో ఉన్న 650 మంది విద్యార్థులు అన్నం లేక పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. తక్షణమే వైస్ ఛాన్స్‌లర్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీని కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని, తక్షణమే అవినీతి విసిని బర్తరఫ్ చేసి యూనివర్సిటీని కాపాడాలని కోరారు. లేని పక్షంలో విద్యార్థి సంఘాలు, విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

4వ రోజుకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె..

తెలంగాణ యూనివర్సిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె గురువారం నాలుగో రోజుకు చేరుకుంది. 273 మంది సిబ్బంది టియు పరిపాలన భవనం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. విసి, రిజిస్ట్రార్‌ల నిర్లక్ష్యంతో మే నెల వేతనాలు 15 రోజులు గడుస్తున్నా నేటికీ అందలేదని యూనివర్సిటీ అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ప్రతినిధులు సురేష్, బికోజీ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైస్ ఛాన్స్‌లర్ నిర్లక్ష్యం కారణంగానే ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు అందడం లేదని ఆరోపించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఒకరిని, పాలకమండలి మరొక రిజిస్ట్రార్‌ను నియమించి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. వేతనాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు అందేలా చూడాలని కోరారు. బుధవారం యూనివర్సిటీకి వచ్చిన వైస్ ఛాన్స్‌లర్‌ను ఔట్ సోర్సింగ్ సిబ్బంది, విద్యార్థులు ఘెరావ్ చేయగా గురువారం వేతనాలు చెల్లించే విధంగా చూస్తానని హామీనిచ్చినా మార్పు లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

LAURUS Labs
Knowledge . Innovation . Excellence

లారస్ ల్యాబ్స్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం: లారస్ ఎన్‌క్లేవ్, ప్లాట్ ఆఫీస్ 01, ఇ. బోనంగి (గ్రా), పరవాడ (మ), అనకాపల్లి (జి) - 531021, ఆంధ్రప్రదేశ్
కార్పొరేట్ ఆఫీస్: 2వ అంతస్తు, సెరీన్ ఛాంబర్స్, రోడ్ నెం.7, బంజారా హిల్స్, హైదరాబాద్ - 500 034, తెలంగాణ
ఫోన్: +91 40 3980 4333, ఫ్యాక్స్: +91 40 3980 4320 ఇమెయిల్: secretarial@lauruslabs.com వెబ్‌సైట్:www.lauruslabs.com
Corporate Identity Number: L24239AP2005PLC047518

ప్రకటన

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, సెక్యూరిటీస్ అండ్ ఎక్ఛేంజి బోర్డ్ ఆఫ్ ఇండియా (ఎస్ఇబిఐ) మరియు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ (ఎంసిఏ) వారిచే జారీచేయబడిన సర్క్యులర్స్‌తో చదువబడే దాని క్రింది రూల్స్ మరియు కంపెనీల చట్టం, 2013 యొక్క నియమాలననుసరించి, కంపెనీ యొక్క 18వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజియం), శుక్రవారం, 14 జులై, 2023న మ॥ 03.00గం.లకు వీడియో కాన్ఫరెన్సింగ్ (విసి) లేదా ఇతర ఆడియో విజువల్ మాధ్యమాలు (ఓఎవిఎం) ద్వారా నిర్వహించుటకు షెడ్యూలు నిర్ణయించబడినది. మరియు వార్షిక సర్వసభ్య సమావేశం (ఎజియం) నోటీసు మరియు వార్షిక రిపోర్టులను ఎలక్ట్రానిక్‌గా డిస్పాచ్ చేయబడుచున్నవి.

తదుపరి, ఏజియం కొరకు రిజిష్టర్ ఆఫ్ మెంబర్స్ జులై 08, 2023 నుండి జులై 14, 2023 (రెండు రోజులుతో సహా) వరకు ('బుక్ ముగింపు తేదీలు') ముగిసియుంటాయి.

పై నిమిత్తం, ఎంసిఎ మరియు సెబి యొక్క సర్క్యులర్స్ ప్రకారం కంపెనీ/ రిజిస్ట్రార్ మరియు ట్రాన్స్‌ఫర్ ఏజెంట్ (ఆర్‌టిఏ)/ డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌తో రిజిస్టరైన సభ్యుల ఇ-మెయిల్ చిరునామాకు ఎలక్ట్రానిక్ రూపంలో ఏజియం నోటీసు మరియు వార్షిక రిపోర్టు పంపబడుచున్నది. ఈ విషయంలో, సమాచారాలన్నింటి కొరకు సభ్యులు ఎవరి ఇమెయిల్ ఐడిలైతే వారి డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌తో రిజిష్టర్ కాని వారికి దిగువ సూచనల ద్వారా మెసర్స్ కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ది కంపెనీ యొక్క ఆర్‌టిఏ)తో లేదా వారి సదరు డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌తో వారి సదరు ఇమెయిల్ ఐడిలు రిజిస్టర్/అప్‌డేట్‌చేసుకోవలసిందిగా కోరబడుచున్నది.

■ ఇమెయిల్ ఐడి- **einward.ris@kfintech.com** పై కంపెనీ యొక్క ఆర్‌టిఏ, మెసర్స్ కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్‌కు మరియు కంపెనీకి ఇమెయిల్ ఐడి: **secretarial@lauruslabs.com** పై ఒక కాపీతో సబ్జెక్ట్ లైన్: (**unit-LAURUS LABS**) పేర్కొంటూ అభ్యర్థనను పంపవచ్చును.

ఇమెయిల్ ఐడి రిజిస్టర్ చేసుకొనుట కొరకు:
- ఫోలియో నం./ క్లైంట్ ఐడి మరియు డిపి-ఐడి;
- వాటాదారు పేరు;
- షేర్ సర్టిఫికేట్ల (ఫిజికల్ హోల్డర్స్ కొరకు) యొక్క స్కాన్ కాపీ
- పాన్ కార్డు యొక్క సెల్ఫ్-అటెస్టెడ్ స్కాన్ కాపీ
- ఆధార్ కార్డు యొక్క సెల్ఫ్-అటెస్టెడ్ స్కాన్ కాపీ

ఏజియం నోటీసు మరియు వార్షిక రిపోర్టు కంపెనీ యొక్క వెబ్‌సైట్ **www.lauruslabs.com** లో అందుబాటులో ఉంటాయి మరియు నోటీసును స్టాక్ ఎక్ఛేంజిలు అనగా., బిఎస్ఇ లిమిటెడ్ **www.bseindia.com** మరియు నేషనల్ స్టాక్ ఎక్ఛేంజి ఆఫ్ ఇండియా లిమిటెడ్ **www.nseindia.com** వద్ద కూడా యాక్సెస్ కూడా చేయవచ్చును.

కంపెనీ సమావేశం జరుగు సమయంలో రిమోట్ ఇ-ఓటింగ్ సదుపాయం అదే విధంగా ఇ-ఓటింగ్ సదుపాయం సమకూర్చుతుంది. ఎవరైతే కంపెనీ/ఆర్‌టిఏ డిపాజిటరీ పార్టిసింపెంట్స్‌తో ఇమెయిల్ చిరునామా రిజిస్టరు చేసుకోలేదో అట్టి సభ్యులు రిమోట్ ఇ-ఓటింగ్ విధానం ద్వారా లేదా సమావేశం సమయంలో ఇ-ఓటింగ్ ద్వారా వారి ఓటును వేయవచ్చును కూడా మరియు రిమోట్ ఇ-ఓటింగ్ మరియు ఇ-ఓటింగ్ యొక్క వివరణాత్మక విధానం ఏజియం నోటీసులో ఇవ్వబడినవి.

డివిడెండ్స్ :
సభ్యులు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు డివిడెండ్ మొత్తాలు స్వీకరించుట కొరకు సదరు డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌తో బ్యాంక్ ఖాతా వివరాలను రిజిస్టర్/అప్‌డేట్ చేయవలసిందిగా కోరబడుచున్నది.

లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ తరపున
సం/- **జి. వెంకటేశ్వర్ రెడ్డి**
కంపెనీ సెక్రటరీ

ప్రదేశం: హైదరాబాద్
తేది: జూన్ 15, 2023

త్వరలో గురుకుల పరీక్షల తేదీల ప్రకటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ గురుకులాల్లో ఉద్యోగాల భర్తీకి నిర్వహించే పరీక్షల తేదీలను అధికారులు నిర్ణయించారు. ఒకట్రెండు రోజుల్లో పూర్తి షెడ్యూల్‌ను ప్రకటిస్తామని తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు(టీఆర్ఈఐఆర్‌బీ) కన్వీనర్ మల్లయ్య భట్టు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకులాల్లో బోధనా సిబ్బంది ఉద్యోగాల భర్తీ ప్రక్రియకు సంబంధించి గురుకుల విద్యాలయాల సంస్థ ఈ ఉద్యోగాల భర్తీకి నిర్వహించే పరీక్ష తేదీలను ఖరారు చేసింది. ఆగస్టు 1నుంచి 23వ తేదీ వరకు గురుకుల నియామక పరీక్ష నిర్వహించనున్నట్టు అధికారులు వెల్లడించారు. ఈ పరీక్షలన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతాయని తెలిపారు. 9వేల పైచిలుకు పోస్టులకు గాను గురుకుల నియామక బోర్డు 9నోటిఫికేషన్లను విడివిడిగా విడుదల చేయగా..2.63లక్షల మందికి పైగా దరఖాస్తులు చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ పరీక్షల షెడ్యూల్‌ను ఒకటిరెండు రోజుల్లో వెల్లడించనున్నట్టు వారు తెలిపారు.

బంగారు తెలంగాణలో రైతు ఆత్మహత్యలుంటాయా?

- మహేష్‌కుమార్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బంగారు తెలంగాణలో రైతు ఆత్మహత్యలుంటాయా? అని టిపిసిసి కార్యనిర్వహణ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బిఆర్ఎస్ నాయకులను కలిసేందుకు వెళ్లిన వారికి బేడీలు వేస్తారా? అని నిలదీశారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రైతుల చేతులకు బేడీలు వేసి వాళ్లురైతులే కాదని బుకాయిస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో రైతులకున్న కష్టాలు ఏ రాష్ట్రంలో లేవన్నారు. అప్పట్లో ఖమ్మం రైతులకు బేడీలు వేశారని, ఇప్పుడు భువనగిరి రైతులకు బేడీలు వేశారని గుర్తు చేశారు. ధరణి పేరిట బీఆర్ఎస్ నేతలు భూములు కొల్లగొడుతున్నారని చెప్పారు. కొంత మంది కలెక్టర్లు ధరణి పేరుపై పేదల భూములను కాజేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ వ్యాప్తంగా జూలై2న రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ జరుగుతుందనీ, యువతీ, యువకులు, విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

కూకట్‌పల్లిలో చేతక్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభం

హైదరాబాద్ : సిద్ధి వినాయక ఆటోమొబైల్స్ కూకట్‌పల్లిలో ప్రత్యేకంగా మరో కొత్త చేతక్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించింది. నూతన స్టోర్‌ను ఆ షోరూం భవన యాజమాని ఎన్ సూర్య ప్రకాష్ రావు, చేతక్ అర్బనైట్ వైస్ ప్రెసిడెంట్ సోయెబ్ ఫరూఖ్, జోనల్ సేల్స్ అండడ్ సర్వీస్ మేనేజర్లు గోపాల్ ఎస్ ఆరాధ్యుల, ఏరియా మేనేజర్ ఎన్ రఘువంశీధర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిద్ధి వినాయక ఆటోమొబైల్స్ యాజమాని బాబుల్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో చేతక్ కస్టమర్ల కోసం ప్రత్యేక షోరూమ్ ఏర్పాటు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటికే బేగంపేట, కాచిగూడలో చేతక్ సిఇసిని కలిగి ఉన్నామని, గత నెలలో కాచిగూడ చేతక్ ఎక్స్‌క్లూజివ్ వర్క్‌షాప్ ప్రారంభించామని అన్నారు.

ఆర్‌జియుకెటికి ఏమైంది..?

- ఏడాదిలో నలుగురు విద్యార్థులు బలవన్మరణం
- నాలుగు రోజుల వ్యవధిలోనే ఇద్దరు మృతి
- యూనివర్సిటీలో వరుస వివాదాలతో అప్రతిష్ట
- సమస్యలపై స్పందించని యాజమాన్యం, ప్రభుత్వం
- గతేడాది వారం రోజులు ఆందోళన చేసిన విద్యార్థులు
- అమలుకాని విద్యాశాఖ మంత్రి హామీలు

యునివర్సిటీ భవనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిర్మల్ జిల్లా బాసర ఆర్‌జియుకెటి యూనివర్సిటీలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. తరచూ విషాద ఘటనలు జరుగుతుండటంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. వరుస వివాదాలతో యూనివర్సిటీ అప్రతిష్టపాలవుతోంది. నాలుగు రోజుల వ్యవధిలో ఇద్దరు విద్యార్థినులు మృతిచెందడంతో తోటి విద్యార్థులు, తల్లిదండ్రులను కలిచివేస్తోంది. నాలుగు రోజుల కిందట దీపిక ఆత్మహత్య చేసుకుంది. తాజాగా పియుసి మొదటి సంవత్సరం చదువుతున్న సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు చెందిన బూర లిఖిత గురువారం హాస్టల్ భవనం నుంచి పడి మృతిచెందడం తీవ్ర విషాదం నింపింది. ఏడాదిలో నలుగురు విద్యార్థులు వివిధ కారణాలతో ఆత్మహత్య చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ యూనివర్సిటీ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు సుమారు 20 మంది వరకు మృతిచెందినట్టు ప్రచారం జరుగుతోంది. కాగా, సమస్యలపై గతేడాది విద్యార్థులు వారం రోజులు నిరవధికంగా ఆందోళన చేసిన విషయం విదితమే. చివరకు విద్యాశాఖ మంత్రి స్పందించి విద్యార్థులతో చర్చలు జరిపి.. డిమాండ్లను నెరవేరుస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు ఒక్కటీ అమలు చేయలేదు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు తలమానికంగా ఉన్న బాసర ఆర్‌జియుకెటి యూనివర్సిటీ తరచూ వివాదాలతో వార్తల్లోకెక్కుతోంది. ముఖ్యంగా విద్యార్థుల వరుస మరణాలు అందరినీ ఆందోళనకు గురి చేస్తున్నాయి. గత సంవత్సరం నుంచి ఇప్పటి వరకు యూనివర్సిటీకి చెందిన నలుగురు విద్యార్థులు వివిధ కారణాలతో మృతిచెందారు. రాథోడ్ సురేష్, భానుప్రసాద్ వ్యక్తిగత కారణాలు, ప్రేమ వ్యవహారాల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలియగా.. యూనివర్సిటీ అధికారుల వేధింపులు కారణంగానే బాత్‌రూమ్‌లో చున్నీతో ఉరేసుకొని దీపిక ఆత్మహత్య చేసుకుందని తండ్రి వీరన్న ఆరోపించారు. వార్షిక పరీక్షల సందర్భంగా దీపిక సెల్‌ఫోన్‌లో కాపీయింగ్ పాల్పడుతుండగా పట్టుబడినట్టు యూనివర్సిటీ అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా, లిఖిత గురువారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో నాల్గో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు పడి మృతిచెందినట్టు యూనివర్సిటీ అధికారులు చెబుతుండగా.. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన జరిగిందని విద్యార్థి సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు ఆరోపించాయి. విద్యార్థుల మరణాలు తల్లిదండ్రులను తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నాయి. యూనివర్సిటీ హాస్టళ్లలో వార్డెన్ల సరైన పర్యవేక్షణ లేక ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

సమస్యలపై స్పందించని ప్రభుత్వం

విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం కోసం గత సంవత్సరం ఇదే నెలలో వారం రోజులపాటు ఆందోళన చేపట్టారు. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ నిరసన చేపట్టారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు ఆందోళన విరమించేదిలేదని స్పష్టం చేశారు. చివరకు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి యూనివర్సిటీకి వచ్చి విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలు పరిష్కరిస్తామని తరగతులకు హాజరుకావాలని సూచించారు. ప్రధానంగా యూనివర్సిటీకి రెగ్యులర్ వైస్ ఛాన్సలర్‌ను నియమించాలని, విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా అధ్యాపకుల భర్తీ, విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, నూతనంగా మెస్‌లు ఏర్పాటు చేయాలని, యూనిఫామ్స్ అందజేయాలని, పిఇటిలను నియమించాలని కోరారు. ఈ డిమాండ్లలో ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్కటీ నెరవేర్చలేదు. రెగ్యులర్ విసికి బదులు ఇన్‌చార్జి డైరెక్టర్‌ను నియమించి చేతులు దులుపుకొందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డైరెక్టర్ పదవీ కాలం కూడా మరికొన్ని రోజుల్లో ముగియనుందని తెలుస్తోంది. మిగతా డిమాండ్లను పట్టించుకోవడం లేదు. ఐటీ శాఖ మంత్రి కెటిఆర్ యూనివర్సిటీలో పర్యటించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

త్వరలోనే మెస్‌లను మారుస్తామని హామీ ఇచ్చినా అదీ నెరవేరకపోవడంతో విద్యార్థులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు.

బాసర త్రిపుల్‌ఐటి ఘటనలపై ప్రభుత్వం స్పందించాలి

- ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బాసర త్రిపుల్‌ఐటీలో వరుస ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. అమ్మాయి చనిపోయిన ఘటన ప్రమాదమా లేక ఆత్మహత్యా అన్నది నిగ్గు తేల్చాలని కోరింది. ఈ ఘటనపై ఉన్నత స్థాయి సమీక్షను ప్రభుత్వం నిర్వహించాలని తెలిపింది. అక్కడ నిరసన తెలిపేందుకు వచ్చిన ఎస్ఎఫ్ఐ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించింది. వారిని వెటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిర్మల్ జిల్లా బాసర త్రిపుల్‌ఐటీలో వరుసగా ఇద్దరు విద్యార్థినీలు చనిపోయారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు బాసటగా నిలవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం చేయకుండా తాత్సారం చేయడం వల్లే ఈ ఘటనలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థి మరణం ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఆత్మహత్య అనే అంశంపై విచారణ జరిపించాలని కోరారు. వసతులు సరిగ్గా లేకనే ఈ ఘటన జరిగిందని తెలిపారు. సరైన సౌకర్యాలు కల్పించని మూలంగా విద్యార్థుల ప్రాణాలను అధికారులు గాలికి వదిలేసి వ్యవరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఘటనలో నిర్లక్ష్యంగా ఉన్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న ఈ విశ్వవిద్యాలయం పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గుచేటని విమర్శించారు. పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తున్నదని తెలిపారు. కావున తక్షణమే ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. చనిపోయిన దీపికా కుటుంబాన్ని అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకుని న్యాయం చేయాలని కోరారు.

వెరిఫికేషన్ లేకుండా షెడ్యూల్ విడుదల చేస్తారా?

- ఎన్నికల షెడ్యూల్ మార్చాలి : జి నిరంజన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

క్షేత్రస్థాయిలో ఎన్నికల వెరిఫికేషన్ లేకుండా షెడ్యూల్ ఎలా విడుదల చేస్తారని టిపిసిసి ఉపాధ్యక్షులు జి నిరంజన్ ప్రశ్నించారు. వెంటనే ఎన్నికల షెడ్యూల్ మార్చాలని కోరారు. ఐదు రాష్ట్రాల్లో జరిగే ఎన్నికల కోసం స్పెషల్ సమ్మరి డివిజన్ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. ఇదే అంశంపై గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. దీని ప్రకారం మే 25 నుంచి జూన్ 23 వరకు బూత్ లెవెల్ ఆఫీసర్స్ ఇంటింటికి తిరిగి ఓటర్ జాబితాలో ఉన్న పేర్లు పరిశీలన చేయాలన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు.

హైటెక్ రాష్ట్రంలో ఇదేం విధానం..?

- కులాల వారీగా భూ కేటాయింపు రాజ్యాంగవిరుద్ధం
- ప్రభుత్వ తీరు కులవిభజనకు దారితీసేలా ఉంది
- కుల సంఘాలకు భూముల కేటాయింపుపై ఆశ్యర్యం వ్యక్తం చేసిన హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కులాల వారీగా భూములు కేటాయించడమేంటని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. కులాల వారీగా భూములు కేటాయించడం ఆర్టికల్ 14కి విరుద్ధమని వ్యాఖ్యానించింది. ప్రభుత్వం తీరు సమాజంలో కుల విభజనకు దారి తీసేలా ఉంది. 21వ శతాబ్దంలో.. హైటెక్ రాష్ట్రంలో ఇదేం విధానం? కులాల వారీగా భూ కేటాయింపులు అసంబద్ధం, తప్పు అని హైకోర్టు వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి, అణగారిన వర్గాలకు మాత్రమే భూములు ఇవ్వాలని, కులాంతర వివాహాలను ప్రోత్సహించడం వంటి విధానాలు ఉండాలని స్పష్టం చేసింది. ప్రభుత్వం ఇరుకైన ఆలోచనలు వీడి.. విశాలంగా ఆలోచించాలని హైకోర్టు ప్రభుత్వానికి సూచించింది. వెలమ, కమ్మ సంఘాలకు భూ కేటాయింపులపై విశ్రాంత ప్రొఫెసర్ వినాయక్ రెడ్డి దాఖలు చేసిన పిల్‌పై సిజె జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. 2021లో ఖానామెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం కమ్మ, వెలమ సంఘాలకు 5 ఎకరాల చొప్పున కేటాయించిందని పిటిషనర్ కోర్టు దృష్టికి తెచ్చారు. శారదాపీఠం, జీయర్ వేదిక్ అకాడమీకి భూముల కేటాయింపుపై కూడా హైకోర్టులో విచారణ జరిగింది. సికింద్రాబాద్‌కు చెందిన వీరాచారి వేసిన పిటిషన్లపై సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. రూ.కోట్ల విలువైన భూములను ఎకరానికి రూపాయి చొప్పున ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఏజీ ప్రసాద్.. సంప్రదాయాలు, వేదాలను ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. శారదాపీఠం, జీయర్ అకాడమీకి భూ కేటాయింపులపై కేబినెట్ నిర్ణయాల్లో తప్పేమీ లేదన్నారు. పిటిషన్లపై స్పందించాలని విశాఖ శారదాపీఠం, జీయర్ అకాడమీకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విశాఖ శారద పీఠానికి భూకేటాయింపుపై విచారణ జులై 24కి, జీయర్ అకాడమీకి భూకేటాయింపుపై విచారణ ఆగస్టు 1కి వాయిదా వేసింది. రెడ్డి కాలేజీ సొసైటీకి బద్వేల్‌లో భూమి కేటాయింపుపై సామాజిక కార్యకర్తలు రాజేశ్వరరావు, విజయ్ కుమార్ దాఖలు చేసిన పిల్‌పైనా హైకోర్టు విచారణ చేపట్టింది. రూపాయికి ఎకరం చొప్పున 5 ఎకరాలు కేటాయించడం రాజ్యాంగవిరుద్ధమని పిటిషనర్లు కోర్టు దృష్టికి తెచ్చారు. 2018లో భూమి కేటాయిస్తే అయిదేళ్ల తర్వాత పిల్ ఎందుకు వేశారని హైకోర్టు ప్రశ్నించింది. జీవోను ప్రభుత్వం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయలేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ తెలిపారు. పిల్ వేయడంలో జాప్యానికి కారణాలు, భూమి ప్రస్తుతం ఏ దశలో ఉందో అఫిడవిట్ వేయాలని పిటిషనర్‌ను ఆదేశిస్తూ తదుపరి విచారణను హైకోర్టు జూన్ 23కి వాయిదా వేసింది. దర్శకుడు ఎన్.శంకర్‌కు మోకిలలో 5 ఎకరాల కేటాయింపుపై కరీంనగర్‌కు చెందిన జె.శంకర్ వేసిన పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానంలో మరోసారి విచారణ జరిగింది. రూ.కోట్ల విలువైన భూమిని ఎకరం రూ.5లక్షలకే కేటాయించారని పిటిషనర్ కోర్టు దృష్టికి తెచ్చారు. ఎఫ్‌డీసీ సిఫార్సు మేరకు రాయితీ ధరతో కేటాయించే అధికారం కేబినెట్‌కు ఉందని ఎజి వివరించారు. సినీ స్టూడియో నిర్మాణం కోసం ఎన్.శంకర్‌కు భూమి కేటాయించినట్టు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో పలు సినీ స్టూడియోలకు భూములు కేటాయించారని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. భూమి కేటాయింపులో ఎలాంటి పక్షపాతం, నిబంధనల ఉల్లంఘన లేదని శంకర్ తరఫు న్యాయవాది తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత స్థానికులను ప్రోత్సహించాలన్న విధానంలో భాగంగానే కేటాయించారన్నారు. భూ కేటాయింపులపై 2007 తర్వాత చట్టాలు మారాయని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. తదుపరి విచారణను హైకోర్టు జులై 5కి వాయిదా వేసింది.

హరగోపాల్‌పై కేసును ఉపసంహరించుకోవాలి : సిపిఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రొఫెసర్ హరగోపాల్‌పై చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా) కింద కేసు నమోదు చేయడాన్ని సిపిఐ రాష్ట్ర సమితి తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మావోయిస్టులతో సంబంధాలున్నాయనే సాకుతో తాడ్వాయిలో ఆయనపై కేసు పెట్టడం విడ్డూరంగా ఉందని తెలిపారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం నక్సలైట్లతో చర్చలు జరిపేందుకు ఆయన మధ్యవర్తిత్వం వహించారని గుర్తు చేశారు. గతంలో పలు సమస్యలు తలెత్తినప్పుడు కూడా వివిధ రాష్ట్రాల ప్రభుత్వాల విజ్ఞప్తి మేరకు నక్సలైట్లతో సంప్రదింపులు జరిపారని పేర్కొన్నారు. ప్రజాస్వామిక వాదియైన హరగోపాల్‌పై పోలీసులు కేసు పెట్టడం అన్యాయమని తెలిపారు. ఆయనతో పాటు ప్రొఫెసర్ పద్మజా షా, తదితరులపై కారణం లేకుండా కేసులు పెట్టడం సమంజసం కాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని తక్షణమే వారిపై పోలీసులు నమోదు చేసిన కేసులను ఉపసంహరించేందుకు చర్యలు తీసుకోవడం తెలంగాణ ప్రయోజనాలకు ఉపయోగకరంగా ఉంటుందని సూచించారు.

త్రిపుల్‌ఐటీలో ఆత్మహత్యలపై సిట్టింగ్ జడ్జితో విచారణ : ఎఐఎస్ఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బాసర త్రిపుల్‌ఐటీలో వరుసగా జరుగుతున్న విద్యార్థినీల ఆత్మహత్యలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా అక్కడికి వెళ్లకుండా ముఖ్యమంత్రి, విద్యామంత్రి ఏం చేస్తున్నారని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ గురువారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఆ ప్రాంగణంలోకి విద్యార్థి సంఘాలను, మేధావులను వెళ్లనీయకుండా అరెస్టు చేయడం, నిర్బంధాలు ప్రయోగించడం ఎంత వరకు సమంజసమని తెలిపారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోకుండా ఆత్మస్థైర్యం కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆత్మహత్యలకు కారణాలు తెలుసుకోవాలంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఎనిమిదేళ్లవుతున్నా 'ఉస్మానియా'ను ఎందుకు నిర్మించలేదు

- టిడిపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉస్మానియా ఆస్పత్రిని అప్పటి ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని 2014కు ముందు కెసిఆర్ దొంగ ఏడుపులు ఎందుకు ఏడ్చారనీ, ఇప్పుడెందుకు నిర్మించడం లేదని టిడిపి ప్రశ్నించింది. ఆ 2015 జూలై 22వ తేదీన కెసిఆర్ ఉస్మానియా యూనివర్సిటీని సందర్శించి ...ఉస్మానియాను వారంలోగా ఖాళీ చేస్తాం... ఏడాదిన్నరలో కొత్త భవనాన్ని నిర్మిస్తాం.. ఎన్ని కోట్లయినా ఖర్చు పెడతాం... ఉస్మానియా ప్రతిష్ట నిలబెట్టేలా ట్విన్ టవర్లను నిర్మిస్తామని చెప్పి దాదాపు ఎనిమిదేళ్లవుతున్నా పట్టించుకోలేదని వ్యాఖ్యానించారు. టిడిపి జాతీయ అధికార ప్రతినిధి తిరునగరి జ్యోత్స్న గురువారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ కార్యాలయం ఎన్‌టిఆర్ ట్రస్ట్‌భవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. తొమ్మిదేళ్ల తెలంగాణ రాష్ట్ర ప్రస్థానంలో ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరిట వేడుకలను జరుపుతున్నదన్నారు. బుధవారం ముఖ్యమంత్రి కెసిఆర్ నిమ్స్ దశాబ్ది బ్లాకుకు శంకుస్థాపన చేశారు. సంతోషం.. కానీ పేదోడికి వైద్యం అందించే ఉస్మానియా ఆస్పత్రి ఎక్కడికి పోయింది? ఎందుకు ముఖ్యమంత్రి ఉస్మానియా ఆస్పత్రి పేరునూ మాట్లాడడానికి ఇష్టపడటం లేదని వ్యాఖ్యానించారు. 1168 పడకల సామర్థ్యం గల ఉస్మానియాలో మొత్తం 21 విభాగాలు ఉన్నాయి. 1300 మంది ఇన్‌పేషంట్లకు వసతి కల్పించగల సామర్థ్యం ఉన్న ఉస్మానియా ఆస్పత్రిపై ముఖ్యమంత్రికి ఎందుకు శీత కన్ను..? రెండు వేల మంది పేషెంట్లకు ఓపి సేవలు అందించగల సామర్థ్యం ఉన్నప్పటికీ మీరు ఎందుకు ఉపయోగించకపోవడం లేదని ప్రశ్నించారు. అవసరంలేకున్నా పాత సచివాలయాన్ని కూల్చి యుద్ధ ప్రాతిపదికన కొత్త సచివాలయాన్ని నిర్మించిన కెసిఆర్, పాత బడిపోయి శిథిలావస్థలో ఉన్న ఉస్మానియా ఆస్పత్రి భవనాలను రిపేర్, కొత్త భవనాల నిర్మాణం ఎందుకు చేయడం లేదు అడిగారు. హైదరాబాద్‌కు నాలుగు వైపులా నాలుగు ఆస్పత్రులను ఏర్పాటు చేస్తామన్నారు. అవి ఎక్కడికి పోయాయి..? రాష్ట్రం ఏర్పడినప్పుడు వైద్య ఆరోగ్య విభాగానికి బడ్జెట్‌లో రూ.2100 కోట్లు కేటాయింపులు జరపగా 2023-24 బడ్జెట్ రూ.12,365 కోట్లు కేటాయించామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. ఈ పైసలు ఎక్కడికి పోయాయి? నిమ్స్‌కు ఇచ్చిన ప్రాధాన్యత ఉస్మానియా ఆస్పత్రికి ఎందుకు ఇవ్వడంలేదు? అన్నారు.

లాసెట్‌లో 29,049 మంది ఉత్తీర్ణత

- ఫలితాలు విడుదల చేసిన లింబాద్రి
- 26 లా కాలేజీల్లో 7,560 సీట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో లా కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం నిర్వహించిన లాసెట్ రాతపరీక్షల ఫలితాలను గురువారం హైదరాబాద్‌లో ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి విడుదల చేశారు. లాసెట్‌కు 43,692 మంది దరఖాస్తు చేయగా, 36,218 మంది పరీక్ష రాశారు. వారిలో 29,049 (80.21 శాతం) మంది అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 31,022 మంది అబ్బాయిలు దరఖాస్తు చేస్తే, 25,586 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 20,930 (81.80 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. 12,667 మంది అమ్మాయిలు దరఖాస్తు చేయగా, 10,629 మంది పరీక్ష రాశారు. వారిలో 8,117 (76.37 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ముగ్గురు ట్రాన్స్‌జెండర్లు దరఖాస్తు చేస్తే, ముగ్గురూ పరీక్షకు హాజరయ్యారు. వారిలో ఇద్దరు (66.67 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. మూడేళ్ల ఎల్ఎల్‌బి కోర్సుకు 31,485 మంది దరఖాస్తు చేయగా, 25,747 మంది పరీక్ష రాశారు. వారిలో 20,234 (78.59 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. ఐదేండ్ల ఎల్ఎల్‌బి కోర్సుకు 8,858 మంది దరఖాస్తు చేస్తే, 7,529 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 6,039 (80.21 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. ఎల్ఎల్ఎం కోర్సుకు 3,349 మంది దరఖాస్తు చేయగా, 2,942 మంది పరీక్ష రాశారు. వారిలో 2,776 (94.36 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ర్యాంకు కార్డుల కోసం https://lawcet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. లింబాద్రి, ఒయు విసి డి రవీందర్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 26 లా కాలేజీలున్నాయని చెప్పారు. మూడేండ్ల లా కోర్సుకు సంబంధించి 23 కాలేజీల్లో 4,630 సీట్లు, ఐదేళ్ల లా కోర్సులకు చెందిన 18 కాలేజీల్లో రెండు వేల సీట్లు, ఎల్ఎల్ఎం లా కోర్సుకు సంబంధించిన 19 కాలేజీల్లో 930 సీట్లు కలిపి మొత్తం 7,560 సీట్లున్నాయని వివరించారు. గతేడాది 6,235 సీట్లు భర్తీ అయ్యాయని అన్నారు. 1,325 సీట్లు మిగిలాయని వివరించారు. రాష్ట్రంలోని లా కాలేజీలన్నింటికీ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బిసిఐ) గుర్తింపు ఉందన్నారు. రాష్ట్రంలో గుర్తింపు లేకుండా లా కాలేజీల్లేవని చెప్పారు.

లా కోర్సుకు భారీగా డిమాండ్ ఉందని లింబాద్రి, రవీందర్ అన్నారు. ఎల్ఎల్ఎం కోర్సులో చేరేందుకు 64 ఏళ్ల అభ్యర్థి దరఖాస్తు చేశారని వివరించారు. దీనికి 16 నుంచి 22 ఏళ్ల వారు 126 మంది దరఖాస్తు చేస్తే, 120 మంది, 23 నుంచి 30 ఏండ్ల వారు 1,365 మంది దరఖాస్తు చేయగా, 1,175 మంది, 31 నుంచి 40 ఏళ్ల వారు 1,100 మంది దరఖాస్తు చేస్తే, 878 మంది, 41 నుంచి 50 ఏళ్ల వారు 530 మంది దరఖాస్తు చేయగా, 422 మంది, 51 నుంచి 60 ఏళ్ల వారు 151 మంది దరఖాస్తు చేస్తే, 116 మంది, 60 ఏండ్లు పైబడిన వారు 77 మంది దరఖాస్తు చేయగా, 65 మంది ఉత్తీర్ణత పొందారని వివరించారు. ఎల్ఎల్‌బి మూడేళ్ల కోర్సుకు సంబంధించి 1961లో పుట్టినతేదీ వ్యక్తి (62 ఏండ్ల) దరఖాస్తు చేశారని అన్నారు. దీనికి 16 నుంచి 22 ఏండ్ల వరకు 3,380 మంది దరఖాస్తు చేస్తే, 2,225 మంది, 23 నుంచి 30 ఏండ్ల వారు 12,689 మంది దరఖాస్తు చేయగా, 8,421 మంది, 31 నుంచి 40 ఏళ్ల వరకు 11,239 మంది దరఖాస్తు చేస్తే, 7,013 మంది, 41 నుంచి 50 ఏండ్ల వరకు 3,243 మంది దరఖాస్తు చేయగా, 1,999 మంది, 51 నుంచి 60 ఏళ్ల వరకు 691 మంది దరఖాస్తు చేస్తే, 427 మంది, 60 ఏళ్లకుపైగా 243 మంది దరఖాస్తు చేయగా, 149 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. ఐదేళ్ల లా కోర్సుకు 16 నుంచి 22 ఏళ్ల వారు 5,566 మంది దరఖాస్తు చేస్తే, 3,767 మంది, 23 నుంచి 30 ఏళ్ల వారు 1,958 మంది దరఖాస్తు చేయగా, 1,338 మంది, 31 నుంచి 40 ఏళ్ల వారు 985 మంది దరఖాస్తు చేస్తే, 685 మంది, 41 నుంచి 50 ఏళ్ల వారు 264 మంది దరఖాస్తు చేయగా, 187 మంది, 51 నుంచి 60 ఏళ్ల వారు 71 మంది దరఖాస్తు చేస్తే 53 మంది, 60 ఏళ్లు పైబడిన వారు 14 మంది దరఖాస్తు చేయగా, తొమ్మిది మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, లాసెట్ కన్వీనర్ బి విజయలక్ష్మి, మాజీ కన్వీనర్ జిబి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైన్ గ్రూప్ పేరుతో సైబర్ మోసాలు

- రోజుకో తీరులో రెచ్చిపోతున్న నేరస్థులు
- గతంలో మోసపోయిన వారే అధికం
- డబ్బు రాబట్టుకోవాలని ఇంకొకరిని మోసం చేస్తున్న వైనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సైబర్ నేరస్థులు రోజుకో తీరులో రెచ్చిపోతున్నారు. లక్కీ డ్రాలు, బ్యాంక్ వివరాలు అప్‌డేట్ చేస్తామని, కెవైసి, ఆధార్ అప్‌డేట్, డెబిట్, క్రెడిట్ కార్డుల లిమిట్ పెంచుతామని, బిట్ కాయిన్ వ్యాపారం పేరుతో కొందరు మోసాలకు పాల్పడుతుంటే, మరికొందరు ఉద్యోగాలు, రుణాలు, వీసాలు ఇప్పిస్తామంటూ అందినకాడికి దండుకుంటున్నారు. తాజాగా వైన్ గ్రూప్ పేరుతో అమాయకులకు వల వేస్తున్న నేరస్తులు లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్న విషయం వెలుగుచూసింది.

బాధితులతోనే వ్యాపారం

వైన్ గ్రూప్‌తో మోసపోయిన బాధితులతోనే పెట్టుబడులు, సభ్యులను చేర్చుకుని వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఇది ఒక గొలుసు కట్టు విధానం అని తెలియక అమాయకులు రూ.లక్షలు చెల్లిస్తున్నారు. టెలిగ్రామ్ యాప్‌లో 'అమ్మెల్యే' అనే మహిళ పేరుతో ఉన్న ఐడీతో అన్ని గ్రూప్‌లలో పరిచయం చేసుకుంటారు. సదురు మహిళ పేరుతో సూచనలు, సలహాలు ఇస్తున్నారు. కొంత మందిని టార్గెట్ చేసుకొని వాట్సాప్ గ్రూప్ తయారు చేయిస్తున్నారు. ఒక వాట్సాప్ గ్రూప్ తయారు చేసినందుకు నెలకు కొంత మొత్తంలో డబ్బు పంపిస్తామంటూ నమ్మిస్తున్నారు. ఆ వాట్సాప్ గ్రూప్ అడ్మిన్‌కు 'మాది 'వైన్' తయారు చేసే పెద్ద సంస్థ, వైన్ గ్రూప్ యాప్ ఉంటుంది' అని నమ్మిస్తున్నారు. వాట్సాప్ గ్రూప్‌లో చేరే వారికి అన్ని విషయాలు తామే వివరిస్తామంటూ నమ్మిస్తున్నారు. ముందుగా వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ పెట్టుబడి రూపంలో దాదాపు రూ.17000 చెల్లిస్తారు. ఆ తర్వాత మీరు ఎంత మందిని గ్రూప్‌లలో చేర్పిస్తే అంత మొత్తంలో మీ కమీషన్ డబ్బు పెరుగుతుందంటూ టాస్కులు పెడ్తారు. ఇది నిజమని నమ్మి గ్రూప్ అడ్మిన్ పెట్టుబడులు పెట్టడంతోపాటు స్నేహితులను, తెలిసిన వారిని, తోటి ఉద్యోగులను, బంధువులను ఇలా మరింత మందిని గ్రూప్‌లలో సభ్యులుగా చేర్పించి, సైబర్ నేరగాళ్లకు ఆ గ్రూప్‌ను అప్పగిస్తున్నారు. దీంతో సైబర్ నేరగాళ్లు ఆ గ్రూప్‌లో ఉండే సభ్యులను వ్యక్తిగతంగా, గ్రూప్ వారీగా టార్గెట్ చేసి, వైన్ గ్రూప్ యాప్‌లో పెట్టుబడులు పెట్టించి మోసం చేస్తున్నారు. ఇందులో పెట్టుబడులు పెట్టి మోసపోయిన వాళ్లు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా 'వైన్'గ్రూప్ మోసాలు వెలుగులోకి వస్తున్నాయి.

ఒకే సారీ వేలాది మంది టార్గెట్

సైబర్ నేరగాళ్లు ఇప్పటి వరకు నిరుద్యోగులను, మహిళలను, అమాయకులను టార్గెట్ చేసుకునేవారు. ఈ మెయిల్, సెల్‌ఫోన్, ఫేస్‌బుక్, వాట్సాప్‌లో మెసేజ్‌లో లింక్ పంపించి, వారిని టెలిగ్రామ్ యాప్‌లలోకి రప్పించి, మరో లింక్ ద్వారా ఒక వెబ్‌సైట్ లింక్‌తో బాధితులను పరిచయం చేసుకునేవారు. అయితే, వైన్ గ్రూప్ పేరుతో సైబర్ నేరస్థులు ఒక్కసారిగా వేలాది మందిని మోసం చేస్తున్నారు. ఇక్కడ గ్రూప్ అడ్మిన్‌లు చాలా మందిని ఆ గ్రూప్‌లో చేర్పిస్తున్నారు. మోసపోయిన వాళ్లు మరో కొత్త గ్రూప్‌ను తయారు చేసి, మరింత మందిని అందులోకి చేర్చుతున్నారు. ఇందులో మోసపోయిన బాధితులు సైతం డబ్బు రాబట్టుకోవాలంటే, ఇంకొకరిని మోసం చేస్తూ వెళు_న్నారు. ఇక్కడ తెలిసిన వారే, మరొకరిని ఆ గ్రూప్‌లో చేర్పించడంతో చాలా మంది వైన్ గ్రూప్ చేతిలో మోసానికి గురవుతున్నారు.

ప్రతి రోజూ వేలల్లో లాభాలు..

'వైన్ తయారు చేసే సంస్థ మాకుంది. మా వైన్ ధర రూ.35000 ఉంటుంది, మార్కెట్లో బాగా డిమాండ్ ఉంది. ఎక్కువ మందికి వ్యాపారంలో భాగస్వామ్యం ఇవ్వాలని పరిచయం చేస్తున్నాం. వైన్‌పై మీరు పెట్టుబడి పెడితే మీకు ప్రతి రోజూ రూ.2,200 లాభం వస్తుంది' అని నమ్మిస్తారు. ఇది నమ్మిన చాలా మంది 'వైన్ యాప్'ను డౌన్‌లోడ్ చేసుకొని అందులో పెట్టుబడులు పెడుతున్నారు. అయితే ముందుగా కొంతమందికి ఎక్కువ మొత్తంలో డబ్బు చెల్లించడంతో, చాలా మంది పెట్టుబడులు పెట్టారు. ఇలా రూ.50 వేల నుంచి రూ. పది లక్షల వరకు పెట్టుబడులు పెట్టిన వారున్నారు. ఈ యాప్‌లో పెట్టిన పెట్టుబడి డిజిటల్‌లో కనిపిస్తుండగా, మరోపక్క రోజు వారీ లాభాలు కనిపిస్తుంటాయి. మొదటి ఒకటి రెండ్రోజులు వచ్చిన లాభాన్ని విత్‌డ్రా చేసుకునే వెసులుబాటు కల్పిస్తారు. ఆ తరువాత విత్‌డ్రా ఆప్షన్‌ను బ్లాక్ చేసి, మరింత పెట్టుబడి పెట్టండి, మరిన్ని లాభాలొస్తాయంటూ నమ్మిస్తూ దఫ దఫాలుగా పెట్టుబడులు పెట్టిస్తూ వెళ్తున్నారు.

కష్టపడందే ఏదీ రాదు : సైబర్‌క్రైమ్స్ ఎసిపి, కెవిఎం ప్రసాద్

ఎవరికైనా కష్టపడందే ఏదీ సులువుగా రాదని సైబర్‌క్రైమ్ ఎసిపి, కెవిఎం ప్రసాద్ తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులను నమ్మొద్దన్నారు. ఆన్‌లైన్‌లో ఎవరో తెలియని వ్యక్తులు చెప్పే మాటలు విని, కొందరు వాట్సాప్ గ్రూప్‌లలో అమాయకులను చేర్పించి, వారికి లాభాల ఆశ చూపి బుట్టలో వేస్తున్నారని తెలిపారు. వైన్ గ్రూప్ నిర్వహించే వారు సైతం ఒకప్పుడు బాధితులేనని, వారి డబ్బులు రాబట్టుకోవడం కోసం వారూ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ వైన్‌గ్రూప్ మోసాల వెనుక ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌కు సంబంధించిన వాళ్లే ఉంటున్నారు, ఎక్కువగా దుబాయ్, చైనా సైబర్‌నేరగాళ్లు ఇలాంటి మోసాలు చేసే అవకాశాలున్నాయని చెప్పారు. ఎవరూ ఇలాంటి మోసపూరితమైన మాటలు, మెసేజ్‌లను నమ్మి డబ్బులు పెట్టుబడి పెట్టొద్దన్నారు.